క్లుప్తంగా

10న వేలంపాట

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఉన్న 25 చెట్లను కొట్టుకుని తీసుకుని పోయేందుకు బహిరంగ వేలం వేస్తున్నామని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ బహిరంగ వేలంలో పాల్గొనదల్చిన వారు రూ.20వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాదాపు 20 – 25 టన్నుల వరకు గల చెట్లను వేలం వేస్తామని, పాట దక్కించుకున్న వారు వెంటనే డబ్బు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జాతీయ స్థాయి రోప్ జంప్ పోటీలకు ఎంపిక


గోల్డ్ మెడల్ సాధించిన షఫియ

దువ్వూరు : మండల పరిధిలోని పుల్లారెడ్డి పేట కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సయ్యద్ షఫియా, నిహారిక జాతీయ స్థాయి రోప్ జంప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారి మల్లేశ్వరి ఆదివారం తెలిపారు. ఈనెల 2, 3 తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని భారతి విద్యామందిరంలో స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో షఫియ గోల్డ్, నిహారిక సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు.

ఈనెల 20న మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో జరిగే జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను పీఈటీ రమణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

అట్లూరు : అకాల వర్షాలతో పండ్లతోటల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా బద్వేలు ఉద్యాన డివిజన్ పరిధిలోని సిద్దవటం, అట్లూరు, గోపవరం మండలాలలో ఉన్న చీనీ, మామిడి, నిమ్మ రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మామిడి కోత దశలో ఉన్నందున త్వరితగతిన కాయలను విక్రయించుకోవాలన్నారు. అలాగే 10 నుంచి 15 రోజులలో కోతకు వచ్చే చెట్లపై పోటాషియం నైట్రేట్+ బోరాక్స్ ఉద్యాన అధికారుల సిఫార్సు మేరకు పిచికారీ చేసుకోవాలన్నారు. వర్షాల అనంతరం కూడా ఉద్యాన అధికారుల సలహాలు సూచనల మేరకు మందులు వాడాలన్నారు.

పదిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా


రేనాటివీరవైష్ణవి


కె.నాగలక్ష్మి


విష్ణువర్ధన్


వెంకట మనోజ్

బద్వేలు అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఎస్.వెంకటశివ 578 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల నియోజకవర్గస్థాయిలో టాపర్‌గా నిలిచాడు. ఈ విద్యార్థి తండ్రి వెంకటరమణ కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన జీ.మెర్సీరాణి 574 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఈమె తండ్రి దేవదాస్ కండక్టర్‌గా పనిచేస్తుంటాడు. ఈ పాఠశాలలో 26 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. అలాగే పూసలవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మొఘల్‌ఆసిన్ అనే విద్యార్థినీ 532 మార్కులతో స్కూల్ ఫస్ట్‌గా నిలిచింది. పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో ఉంటూ ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతుండే ఎస్.హరినాథ్ 584 మార్కులు సాధించగా ఇదే వసతిగృహంలోని 8 మంది విద్యార్థులు 500 పైచిలుకు మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థిని హాస్టల్ వార్డెన్ ప్రసాద్ అభినందించారు. స్థానిక చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సి.వెంకటలక్ష్మి అనే విద్యార్థినీ 517 మార్కులు సాధించింది.

కలసపాడులో..

కలసపాడు : మండలంలోని ఎగువరామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రేనాటివీరవైష్ణవి 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కలసపాడు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.నాగలక్ష్మి 553 మార్కులు సాధించింది. ఎగువ రామాపురంలో ఉన్నత పాఠశాలలో 77 శాతం, కలసపాడు బాలుర ఉన్నత పాఠశాలలో 74 శాతం, బాలికల ఉన్నత పాఠశాలలో 73 శాతం, శంఖవరం ఉన్నత పాఠశాలలో 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ఎగువ రామాపురం గ్రామానికి చెందిన రేనాటిబ్రహ్మానందరెడ్డి, సావిత్రిల కుమార్తె అయిన రేనాటివీరవైష్ణవి మండల టాపర్‌గా నిలవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : మండలంలోని టేకూరుపేట, గానుగపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పది పరీక్షల్లో సత్తాచాటారు. టేకూరుపేట జడ్పీహైస్కూల్‌కు చెందిన విష్ణువర్ధన్ 578, మనోజ్‌కుమార్ 570 మార్కులు సాధించగా, పాఠశాలలో 7 మంది 500 పైగా మార్కులు సాధించారని హెడ్మాష్టర్ రంగస్వామి తెలిపారు. గానుగపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గురువర్ధన్ 578 మార్కులు సాధించగా, సుజాత 550 మార్కులు సాధించింది.

మొర్రాయిపల్లెలో పెద్దమ్మ తల్లి జాతర

చాపాడు: మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలో ఆదివారం ఘనంగా పెద్దమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రజలందరూ సంయుక్తంగా పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ మంచి జరగాలని, రైతులు పాడి పంటలతో తలతూగుతూ సుఖ సంతోషాలతో వర్థిల్లాలని అమ్మవారికి పూజలు నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న విశ్వనాథరెడ్డి దంపతులు

కాశినాయన : మండలంలోని కె.ఎస్.కొట్టాల గ్రామంలో దేవాదాయశాఖ నిధులతో నిర్మిస్తున్న శివకేశవుల దేవాలయ నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి దంపతులు, గ్రామస్తులు భూమిపూజ చేశారు. దేవాదాయశాఖ రూ.1.10 కోట్లు, గ్రామస్తులు రూ.50 లక్షలతో దేవాలయ నిర్మాణాన్ని చేపడుతున్నారు. వేదపండితులతో చండీయాగం నిర్వహించి భూమిపూజ చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరగాయత్రి హాస్పిటల్ నూతన భవనం ప్రారంభం


ఎమ్మెల్యే రాచమల్లుతో డాక్టర్లు వీరప్రసాద్‌రెడ్డి దంపతులు

ప్రొద్దుటూరు క్రైం : గాంధీ రోడ్డు సమీపంలో ఉన్న అభ్యాస్ కాలేజి దగ్గర వీరగాయత్రి హాస్పిటల్ నూతన భవనాన్ని ఆదివారం ప్రాంభించారు. డాక్టర్ వీరప్రసాద్ రెడ్డి, డాక్టర్ కందుల సుమిత్రలు కుటుంబ సభ్యులతో కలసి ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాదరెడ్డి, రఘురామిరెడ్డి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే నంద్యాల లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, రాయలసీమ పోలీసు కంప్‌లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, డాక్టర్లు నాగార్జున యాదవ్, నజీర్ బాషా, హిమబిందు, కాత్యా, హరీష్‌కుమార్, జయభరత్‌రెడ్డి, రాంబాబు, శ్రీనాథరెడ్డి, స్వరూప్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్, విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన డీవైఎఫ్‌ఐ శిక్షణ తరగతులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని బీసీ హాస్టల్ ఆవరణలో శనివారం నుండి ప్రారంభమైన డీవైఎఫ్‌ఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జీ.రామన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగ యువత కోసం ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం అనంతరం అల్లూరిసీతారామరాజు వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్ని, వి.శివకుమార్, కడప నగర కార్యదర్శి ఓబులేసు, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నడింపల్లెలో ఆదివారం ఎస్‌బీ, ఎస్‌డీఎస్, ఎస్‌ఎంహెచ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జామియా మసీదు చైర్మన్ అహ్మద్ హుసేన్ , మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్ చింతకుంట సరిత, ట్రస్ట్ చైర్మన్ రిటైర్డ్ జడ్జ్ ఎస్‌ఎం ఇస్మాయిల్, కో చైర్మన్ విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఖాజా మైనోద్దీన్, ఇదాయత్, ఫరీద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీసు కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, ఎస్‌బీ మెమోరియల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదవ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనపరచిన అత్యధిక మార్కులు సాధించిన దేవాంగ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయం పేర్కొన్నారు. స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10లో అత్యధిక మార్కులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రతి గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు, కన్సోలేషన్ బహుమతిగా రూ.2వేలు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో చదువుకున్న ప్రతిభ గల దేవాంగ కుల పేద విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. తమ దరఖాస్తులను దేవాంగ కళ్యాణ మండపంలో ఈ నెల 25 లోపల అందచేయాలని కోరారు. సమావేశంలో దేవాంగ కల్యాణ మండపం అధ్యక్షుడు దేవరశెట్టి ఆదినారాయణ, శాశ్వత గౌరవాధ్యక్షుడు వుట్టి వీరయ్య, కోశాధికారి వుట్టి సోమశేఖరరావు, దేవాంగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వుట్టి లక్ష్మినారాయణ, కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

గోపవరం : మండలంలోని రాచాయపేటలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి 15వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాత్రి చెక్కభజన, చిన్నపిల్లల అకాడమీ డ్యాన్స్ భక్తులను అలరింపజేశాయి.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామం జెడ్పీ హైస్కూల్లో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత వీరంతా కలసి నాటి గురువులతో పాటు అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో గౌరవాన్ని పొందినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి, జయరామిరెడ్డి, నాగసుబ్బారెడ్డి, గౌస్, శ్రవణ్, అన్నమాచార్యులు, వెంకటరామిరెడ్డి, అన్నపూర్ణమ్మ దేవి తోపాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాల నిర్వహణ, రుచికర వంటలు తయారు చేయించడంలో కీలకపాత్ర వహించిన నాగమునిరెడ్డి, దస్తగిరి, తస్లింభానులను అభినందించారు.

రేపు వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని సోమాపురంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 వరకూ నిర్వహించనున్న శిబిరంలో రోగులకు మందులను పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.